క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న మాజీ ఉద్యోగులు

జ్యోతినగర్: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌ను ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు మాజీ ఉద్యోగులు సన్మానించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి సన్మానించారు. మాజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మాజీ ఉద్యోగులు సత్తు ముత్యాలు, మంగళంపల్లి రాంనారాయణ, దుర్గం నర్సయ్య, లాలయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి



సూచనలు చేస్తున్న కమిషనర్ వేణుమాధవ్

సుల్తానాబాద్: ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్ కోరారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు శ్రీరాంపూర్ రోడ్డులో ప్లాస్టిక్ కవర్ల ఏరివేత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కూరగాయలు, కిరాణ దుకాణాలకు వచ్చేవారు విధిగా జనపనార సంచులు తీసుకురావాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌కు ఆధార్ కేంద్రం మంజూరు

సుల్తానాబాద్: మండల కేంద్రానికి ఆధార్ కేంద్రం మంజూరైనట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. సుల్తానాబాద్ మీసేవలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో పెద్దపల్లి, కరీంనగర్ జిల్లా కేంద్రాలకు వెళ్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ప్రజాప్రతినిధులు గతంలో పలుమార్లు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీంతో సమస్య పరిష్కారమై ఆధార్ కేంద్రం ప్రారంభించేందుకు మార్గం సుగుమ అయిందని ఆయన తెలిపారు. ఆధార్ కేంద్రం మంజూరు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

సుల్తానాబాద్‌రూరల్: వరి, మొక్కజొన్న పంటసాగులో యాజమాన్య పద్ధతులను అవలంబించినప్పుడే అధిక దిగుబడి వస్తుందని ఏఈవో ప్రశాంత్ అన్నారు. సుల్తానాబాద్ మండలం మంచిరామి, తొగర్రాయి గ్రామాల్లోని పంటలను రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తెగుళ్లు, కీటకాలకు సంబంధించి, వాటి నివారణకు చేపట్టాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు.

పండ్లు పంపిణీ



పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న నాయకులు

మంథని/ముత్తారం: శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు బర్త్‌డేను పురస్కరించుకొని శనివారం మంథని డివిజన్‌లోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ శ్రేణులు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో సుమారు 300 మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం మాతాశిశు ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఎంపీపీ కొండ శంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి సతీశ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముత్తారంలో..

ముత్తారంలో దుద్దిళ్ల శ్రీనుబాబు బర్త్‌డే ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ముత్తారం జెడ్పీ పాఠశాలలో నోటు బుక్కులు, పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్మోహన్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డబాలాజీ, యూత్ అధ్యక్షుడు బియ్యాని శివకుమార్, మాజీ సర్పంచి తూటి రజిత రఫీ, నాయకులు మద్దెల రాజయ్య, గాదం శ్రీను, కొల విజయ్, లక్కం ప్రభాకర్, గోవిందుల ఆనందర్, బోడ రత్నాకర్ పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి అందజేస్తున్న జగన్

ఓదెల: ఒక కుటుంబంలో ఒక్కరు లేదా ఇద్దరు చాంపియన్స్ ఉంటారు. కానీ ఆ ఇంట్లో ముగ్గురూ చాంపియన్స్. అక్కాచెల్లెళ్లు, తమ్ముడు జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్నారు. గతంలో వాళ్ల కుటుంబంలో పెద్దలు ఎవరూ క్రీడాకారులు లేరు. అయినా వీళ్లు మాత్రం తమదైన శైలిలో ఆటల్లో రాణిస్తూ మెడల్స్ సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించి అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు కొలనూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.

బంగారు కొండలు

- అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు, తమ్ముడు
- జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో బంగారు పతకాలు కైవసం
- ఆదర్శంగా నిలుస్తున్న కొలనూర్ పాఠశాల విద్యార్థులు



పీఈటీతో సౌమ్యశ్రీ, శ్రావ్యశ్రీ



రాష్ట్రస్థాయి గోల్డ్ మెడల్ అందుకుంటున్న సౌమ్యశ్రీ



షాట్‌పుట్ వేస్తున్న శ్రావ్యశ్రీ (ఫైల్)

బంగారు పతకాలే లక్ష్యం..



శ్రావ్యశ్రీని సన్మానిస్తున్న డీఈవో (ఫైల్)

మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన రేండ్ల రాజేందర్-హర్ష దంపతులకు ముగ్గురు సంతానం. కుమార్తెలు శ్రావ్యశ్రీ, సౌమ్యశ్రీ, కుమారుడు సాయి కార్తీక్. వీళ్లు స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్నారు. అక్కాచెల్లెళ్లు, తమ్ముడు ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఫిబ్రవరి 2023లో బిహార్‌లోని పాట్నాలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ షాట్‌పుట్ పోటీల్లో శావ్యశ్రీ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ షాట్‌పుట్ పోటీల్లో సౌమ్యశ్రీ బంగారు పతకం కైవసం చేసుకుంది. సాయి కార్తీక్ జనవరిలో జరిగిన జిల్లాస్థాయి 300 మీటర్ల రన్నింగ్‌లో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

క్రీడల్లో రాణిస్తున్న కొలనూర్ విద్యార్థులు

కొలనూర్ హైస్కూల్ నుంచి 30మంది విద్యార్థులు పలు క్రీడల్లో, అథ్లెటిక్స్‌లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించడానికి ఓదెల ఎంఈవో ఆరెపల్లి రాజన్న, హెచ్‌ఎం ఏసుదాసు, పీఈటీ ప్రణయ్, మన ఊరు- మన బడి గ్రూప్ పూర్వ విద్యార్థులు కృషి చేస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు బంగారు పతకాలు సాధించడంపై ఎంఈవో, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాకు పేరు తెచ్చారు



జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించేలా నిత్యం విద్యార్థులతో ప్రాక్టీస్ చేయిస్తున్నాం. ఎంఈవో, ప్రధానోపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. పలు క్రీడల్లో బంగారు పతకాలను సాధించిన విద్యార్థులు జిల్లాకు పేరు తెచ్చారు. వాళ్లు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షిస్తున్న.

– ప్రణయ్, పీఈటీ, కొలనూర్ హైస్కూల్

మెలకువలు నేర్పిస్తున్నారు



జిల్లా, రాష్ట్రస్థాయితో పాటు జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడానికి నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నా. మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీఈటీ ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నా. ముఖ్యంగా మా పీఈటీ సార్ రోజూ మాతో ప్రాక్టీస్ చేయిస్తున్నారు. ఎప్పటికప్పుడు మెలకువలు నేర్పిస్తున్నారు.

– రేండ్ల శ్రావ్యశ్రీ, 8వ తరగతి, కొలనూర్

జిల్లాస్థాయిలో గోల్డ్‌మెడల్



జిల్లాస్థాయి క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించా. 300 మీటర్ల రన్నింగ్ పోటీలతో పాటు మిగతా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నా. మా స్కూల్ పీఈటీ, టీచర్లు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆటల్లో రాణిస్తున్నాం.

– రేండ్ల సాయి కార్తీక్, 3వ తరగతి, కొలనూర్

రోజూ ప్రాక్టీస్..



ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించా. అథ్లెటిక్స్ పోటీలతో పాటు అన్ని క్రీడల్లో పాల్గొని విజయం సాధించడానికి నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నా. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మరిన్ని విజయాలు సాధిస్తా.

– రేండ్ల సౌమ్యశ్రీ, 7వ తరగతి, కొలనూర్

సమ్మక్క–సారలమ్మ వనప్రవేశం



సుల్తానాబాద్: నీరుకుళ్ల జాతరలో భక్తులు



సుల్తానాబాద్‌రూరల్: దేవతల వనప్రవేశం



పెద్దపల్లిరూరల్: తుర్కలమద్దికుంటలో..



జూలపల్లి: అబ్బాపూర్‌లో వన ప్రవేశం



ధర్మారంలో..



పాలకుర్తి: ఈసాలతక్కళ్లపల్లిలో..

పెద్దపల్లిరూరల్: మూడురోజుల పాటు అశేష భక్తజనం పూజలందుకున్న వనదేవతలు సమ్మక్క–సారలమ్మను శనివారం కోయపూజారులు వనప్రవేశం చేయించారు. రెండేళ్లకోసారి జరిగే జాతర ఉత్సవాలను మండలంలోని హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, పెద్దకల్వల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శనివారం తిరిగి జాతర కమిటీ సభ్యులతో కలిసి వనప్రవేశం చేయించారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నీరుకుల్ల, నారాయణపూర్, గర్రెపల్లి, తొగర్రాయిలో సమ్మక్క–సారలమ్మ జాతర ప్రశాంతంగా జరిగింది. కాగా శనివారం కోయపూజారులు వనప్రవేశం కార్యక్రమం నిర్వహించారు.

జూలపల్లి: మండలంలోని తేలుకుంట, అబ్బాపూర్ గ్రామాల్లో కోయపూజారులు కమిటీ సభ్యుల సమక్షంలో వన ప్రవేశం చేయించారు.

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి–ఎలిగేడు గ్రామాల సరిహద్దున గల పెండ్లి పోరుగుట్ట వద్ద జరిగిన సమ్మక్క జాతరలో భాగంగా శనివారం కోయ పూజారులు వనప్రవేశం నిర్వహించారు.

ధర్మారం: గద్దెలపై కొలువుదీరిన వనదేవతలను శనివారం సాయంత్రం పూజారులు, భక్తులు డబ్బుల చప్పుళ్లతో వనంలోకి తీసుకెళ్లారు.

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో వనదేవతలను కోయపూజారులు వనప్రవేశం చేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మీర్జంపేట, పెగడపల్లి, పెద్దరాతుపల్లి గ్రామాల్లో వనదేవతలను కోయపూజారులు వనప్రవేశం చేయించారు.

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి, వేంనూర్, రాణాపూర్ గ్రామాల్లో అమ్మవార్లను వనప్రవేశం చేయించారు.

కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో అమ్మవార్లను పూజారులు వనప్రవేశం చేయించారు.

సంక్షిప్త వార్తలు

రేపు ఉప్పరపల్లె అండర్ బ్రిడ్జి ప్రారంభం

ఓదెల: కాజీపేట్ నుంచి నాగ్‌పూర్ రైల్వేస్టేషన్ సెక్షన్ల మధ్యలో ఉప్పరపల్లె ఎల్‌సీ35 వద్ద అండర్‌బ్రిడ్జి ప్రారంభోత్సవం 26న సోమవారం జరుగుతుందని ట్రావెలింగ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ తెలిపారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు దేవరకొండ ఉమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని సూచించారు.

కార్మికులకు పదోన్నతి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో పనిచేస్తున్న 28మంది లోడింగ్ కార్మికులకు వేజ్‌బోర్డు కార్మికులుగా పదోన్నతి కల్పిస్తూ శనివారం నియామక పత్రాలు అందజేశారు. కంపెనీ హెచ్‌ఆర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో హెచ్‌ఆర్ మేనేజర్ గోవిందరావు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు సమ్మయ్య అర్హత పొందిన కార్మికులకు ఆర్డర్‌కాపీలు అందజేశారు.

పరామర్శ

గోదావరిఖని: నగరంలోని రమేశ్‌నగర్‌కు చెందిన సూర్యదేవర ప్రసాద్‌రావు ఇటీవల మరణించారు. కాగా వారి కుటుంబ సభ్యులను శనివారం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, ముస్తాఫా ఉన్నారు.

పోరు గర్జనను విజయవంతం చేయండి

గోదావరిఖనిటౌన్: ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద టీఎస్–ఎమ్మార్పీఎస్ తలపెట్టిన పోరు గర్జన మాదిగ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజ్‌కుమార్(తిమోతి) పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో చలో హైదరాబాద్ పోరు గర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు కొట్టెపల్లి దుర్గాప్రసాద్, వడ్లూరి శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, ఈర్ల ప్రేమ్‌కుమార్, మేడి ప్రవీణ్, సుందిళ్ల రేణుక, కండె శ్వేత, రోజా పాల్గొన్నారు.

రైతులపై దాడిని ఖండిస్తున్నాం

యైటింక్లయిన్‌కాలనీ: పంజాబ్, హర్యానా సరిహద్దులో రైతుల డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న అన్నదాతలపై పోలీసులు రబ్బర్ బుల్లెట్లతో కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని భారత కార్మిక సంఘాల సమైక్య రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన తెలిపారు.

మలబార్ చారిటబుల్ ట్రస్టు స్కాలర్‌షిప్

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మలబార్ చారిటబుల్ ట్రస్టు స్కాలర్‌షిప్‌లను శనివారం ట్రస్టు ప్రతినిధులు విక్రం, కృష్ణ పంపిణీ చేశారు. కళాశాలలోని 24 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.8వేల నుంచి రూ.10వేల వరకు పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ అనంత రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పసుపు, కుంకుమలతో భక్తుల సమక్షంలో ఆలయ పూజారి బండవరం రామానుజం పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు ఈర్ల స్వామి, దిడ్డి శంకరయ్య, అవుల శ్రీనివాస్, తమ్మడవేని మధు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న ప్రభుత్వ విప్



ఎత్తు మొక్కులు చెల్లిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం మేడారంలో సమ్మక్క సారలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స చేయించుకుని డిశ్చార్జి అయిన వెంటనే ధర్మారం మండలంలోని వనదేవతలను శుక్రవారం దర్శించుకున్నారు. అదేరాత్రి మేడారం వెళ్లి ఎత్తు బంగారాన్ని సమ్మక్కకు సమర్పించినట్లు ఆయన తెలిపారు.

బొగ్గుగని కార్మికుల కనీస పెన్షన్ రూ.వెయ్యి



సమావేశంలో పాల్గొన్న ట్రస్ట్ బోర్డు సభ్యులు

గోదావరిఖని: బొగ్గు గని కార్మికుల కనీస పెన్షన్ రూ.వెయ్యి చెల్లించే విధానాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, బీఎంఎస్ నేత కొత్తకాపు లక్ష్మారెడ్డి వెల్లడించారు. న్యూఢిల్లీలో 22న 180వ బోర్డు సమావేశం జరిగిందన్నారు. సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డ్ సభ్యులు ఆశిష్‌మూర్తి పాల్గొని ప్రధాన సమస్యలు, ముఖ్యమైన అంశాలపైన చర్చ జరిగిందని పేర్కొన్నారు. పీఎఫ్, పెన్షన్ చట్టాన్ని సవరించడానికి, బొగ్గు గని కార్మికులకు భవిష్యత్‌లో సౌలభ్యం లభించేలా కమిటీని ఏర్పాటు చేసి కొత్త చట్టం రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఉద్యోగికి బదిలీలు సహజం



సన్మానిస్తున్న ఏపీఏ, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎంలు కె.నాగేశ్వరరావు, ఎస్.రాధాకృష్ణ

రామగిరి: విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగికి బదిలీలు సహజమని ఏపీఏ, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎంలు కె.నాగేశ్వరరావు, ఎస్.రాధాకృష్ణ అన్నారు. శనివారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏరియా సర్వే అధికారిగా విధులు నిర్వహిస్తున్న జైనులాబద్దీన్ పదోన్నతిపై కార్పొరేట్ సర్వే జీఎంగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా సన్మానించారు. సింగరేణి సంస్థలో జైనులాబద్దీన్ వివిధ పదవుల్లో అంకితభావంతో చేసిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు. సర్వే జీఎంగా సదోన్నతి పొందినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్లు పి.ఎలీషా, సీతారామం, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఏరియా సేఫ్టీ అధికారి సీ.హెచ్.వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి ఈ.లక్ష్మీనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

పెద్దపల్లిరూరల్: మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని మహిళా సాధికారిత కోఆర్డినేటర్ అరుణ అన్నారు. మహిళా సాధికారిత ఆధ్వర్యంలో శనివారం రాఘవపూర్ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కాలేజీలో బేటీ బచావో బేటీ పడావో అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా సాధికారిక కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ స్వప్న హాజరయ్యారు. మహిళలు బాలికల చదువు ప్రాముఖ్యత గురించి, సఖి, అంగన్వాడీ సేవలు, చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఆఫ్రా జబీన్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలి



అధికారులతో ఎంపీడీవో సమీక్ష సమావేశం

రామగుండం: ఓటు ప్రాధాన్యత, ఓటుహక్కు తదితర అంశాలపై హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎంపీడీవో ఎం ఏ.అలీం ఆదేశించారు. ఈ మేరకు శనివారం జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు అంతర్గాం, పొట్యాల హైస్కూల్స్ హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 26న హైస్కూల్‌లోని 8, 9వ తరగతి విద్యార్థులకు ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్, ఐకేపీ ఏపీఎం సంధి నర్సమ్మ, హైస్కూల్స్ హెచ్‌ఎంలు తదితరులు హాజరయ్యారు.

రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్స్ అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంపై త్వరగా చర్యలు తీసుకోవాలని ఆర్జీ–1 పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల పర్సనల్ ఫైల్స్ డిజిటలైజేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. సీఎంపీఎఫ్ నామినేషన్ల పెండింగ్, కారుణ్య నియామక ఉద్యోగాలు, టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుపై చర్చించారు. సమావేశంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ నరేస్ చక్రవర్తి, సీనియర్ పీవోలు బంగారు సారంగపాణి, శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, గణేశ్, రవీందర్, ఫిరోజ్‌ఖాన్, సంక్షేమ అధికారి ఇక్బాల్ షరీఫ్ పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన



మొక్కలు పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామంలో రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం, సింగరేణి సంగరేణి సంస్థ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులకు కూరగాయల సాగు, పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు, పండ్లతోటల పెంపకం ఎలా సాగు చేయాలో వివరించారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు, పండ్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని, ప్రజలు సేంద్రియ పద్ధతిలో సాగు చేసి మంచి లాభాలు పొందాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ శెవ్వ శంకరయ్య, శాస్త్రవేత్తలు శ్రీనివాస్, వెంకన్న, వెంకటరామిరెడ్డి, కార్యదర్శి వెంకటరమణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ నియంత్రణపై అవగాహన

గోదావరిఖనిటౌన్: రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జె.కృష్ణమూర్తి గోదావరిఖని బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు శనివారం సైబర్ క్రైమ్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల డబ్బును దోచుకోవడానికి వివిధ రకాల మార్గాలను ఎంచుకొని మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. హెడ్ కానిస్టేబుల్ అట్టెం శంకర్, కానిస్టేబుల్స్ ఓ.శ్రీనివాస్, నిమ్మతి శ్రీనివాస్, ప్రశాంత్, ఆటో డ్రైవర్‌లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఓడేడ్‌లో డీఎల్‌పీవో తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శంకర్

ముత్తారం: మండలంలోని ఓడేడ్ పంచాయతీ కార్యాలయాన్ని డీఎల్‌పీవో శంకర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, కారోబార్ ప్రభాకర్ ఉన్నారు.